## క్లుప్తంగా

### సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

**వెదురుకుప్పం:** చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ బాబు అన్నారు. ఆదివారం మండలంలోని పెరుమాళ్లపల్లె చౌక దుకాణంలో కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని చౌక దుకాణాల్లో రేషన్ సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహన్‌మురళీ, వీఆర్‌ఓ నరసింహారెడ్డి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

### బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా శేఖర్

**కార్వేటినగరం:** బాలికల ఉన్నత పాఠశాల(ప్లస్) హెచ్‌ఎంగా మర్రి శేఖర్ ఆదివారం పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా చూస్తానని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు హెచ్‌ఎంగా బాధ్యతలు తీసుకున్న శేఖర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, వేణుగోపాల్, మునిశేఖర్, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

### శీనయ్య సమాధి వద్ద నివాళి



నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**శ్రీరంగరాజపురం:** శ్రీరంగరాజపురం మండలంలోని కటికపల్లి సర్పంచ్ మార్కొండయ్య తండ్రి కొత్తపల్లి శీనయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం కర్మ క్రియల కార్యక్రమంలో శీనయ్య సమాధి వద్ద రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులుగురవారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్, మణి, శ్యామ్, చొక్కా గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆధునికీకరణతో రైతు సాధికారత



డ్రోన్‌తో మందుల పిచికారీ


**నింద్ర:** ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతు సాధికరత సాధించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం తిరుపతి శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని అత్తూరు, అగరం గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించారు. డ్రోన్ పరికరంతో మందుల పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాఘవేంద్ర, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### నేడు వెన్నుపోటు దినం పోస్టర్ల విడుదల



**పుత్తూరు:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయక ప్రజలను మోసం చేసిన నేపథ్యంలో వైఎస్ఆర్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 4వ తేదీన మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎ.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు తన కార్యాలయంలో వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

### ఘనంగా రావూరి పుట్టినరోజు వేడుక



విద్యార్థినిని అభినందిస్తున్న రావూరి వెంకటస్వామి

**పుత్తూరు:** శ్రీవెంకట పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ రావూరి వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేసి, కళాశాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ రెండో ర్యాంకు సాధించిన విద్యార్థి జె.మాధురిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ రావూరి బాలాజీ, ప్రిన్సిపల్స్ సునీల్, గోపీకృష్ణ, మేనేజ్‌మెంట్ మెంబర్ ప్రేమ్‌చంద్, వైస్ ప్రిన్సిపల్ రామ్‌గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### వ్యక్తిత్వ వికాసానికే పినాకా తరగతులు



విద్యార్థులకు సూచనలిస్తున్న రాజారాం కొల్లే

**నగరి:** విద్యార్థులు విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం, జీవన విధానాలపై అవగాహన పెంచుకుంటేనే విజయం లభిస్తుందని, ఆ విజయాన్ని కాపాడుకోవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు లయన్ రాజారాం కొల్లే అన్నారు. మున్సిపల్ పరిధి కొత్తపేటలో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణా తరగతులకు ఆదివారం హాజరైన ఆయన విద్యార్థులకు అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు. సెవెన్ హ్యాబిట్స్ ఆఫ్ హెల్తీ ఎఫెక్టివ్ పీపుల్‌పై పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ మునస్వామి, రిసోర్స్ పర్సన్ మధుసూదన్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డకు.. అందని నిధి

- ఏడాది అవుతున్నా అమలుకాని ఆడబిడ్డ నిధి పథకం
- నమ్మించి నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం

ఎన్నికల సమయంలో ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేస్తామని టీడీపీ అధినేతగా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని సమాధి చేశారు. మహాశక్తి ఆడబిడ్డ నిధి పేరిట ప్రతి ఇంట్లో 18 ఏళ్లు నిండిన మహిళలు ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1500 వస్తుందని నమ్మి మహిళలు సైకిల్ పార్టీకి ఓట్లేసి గెలిపించారు. ఏడాది అవుతున్నా ఈ పథకం అమలుకు నోచుకోలేదు. ఎన్నికల ముందు మహిళల్లో కనిపించిన పేదరికం.. అధికారం చేపట్టగానే మాయమైపోయింది. ప్రభుత్వం కంటికి మహిళలందరూ ధనవంతుల్లా కనిపిస్తున్నారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని సూపర్ సిక్స్ హామీల కింద పెట్టి.. ఇప్పుడు మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించారని.. ఆ పథకం అక్కర్లేదని ఒకవైపు 2029 నాటికి కూడా పేదరికం తగ్గకపోతే అప్పుడు పీ–4 పథకానికి ఆడబిడ్డ నిధి పథకాన్ని అనుసంధానం చేస్తానని ఒకవైపు మాట్లాడుతుండడంతో మహిళలు విస్తుపోతున్నారు. కూటమి ప్రభుత్వం నమ్మించి నట్టేట ముంచిందని తేటతెల్లమవుతోంది. – నగరి



కార్వేటినగరంలో పోస్టాఫీస్ వద్ద ఖాతాల కోసం క్యూ కట్టిన మహిళలు

ఏరు దాటేదాక ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడిమల్లన్న అన్న చందాన కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ అరచేతిలో వైకుంఠం చూపి నేడు దానిని సూపర్ మోసంగా మార్చేసింది. అందులో ఉన్నదే ఆడబిడ్డల నిధి. ఈ పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేశారు. దీనికి ఎంతో ప్రచారం కల్పించారు. తీరా అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా మోసాన్నే కానుకగా ఇస్తూ ఏడాది కాలం గడిపేశారు. ఈ ఏడాది జనవరి నుంచే ఇచ్చేస్తారని అందుకు పోస్టాఫీసు ఖాతాలు ఉండాలని మహిళలు పోస్టాఫీసుకు క్యూకట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. చివరకు అది కూడా ఉత్తుత్తిదే అని తేలింది. దీంతో ఆడబిడ్డల నిధిపై మహిళలు పెట్టుకున్న ఆశలు సమాధి అవుతున్నాయి.

**రూ.372.8 కోట్ల మోసం**

నగరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లోని మహిళలకు కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.372.8 కోట్లు చెల్లించకుండా మోసం చేసింది. 2024 జూన్ నాటి లెక్కల ప్రకారం నగరి నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన, ఆపై వయస్సు కలిగిన మహిళలు 104029 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1500 చొప్పున చెల్లిస్తే రూ. 15,60,43,500 చెల్లించాలి. ఇది ఏడాదికి రూ.187,25,22,000 అవుతుంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన, ఆపై వయస్సు కలిగిన మహిళలు 103090 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1500 చొప్పున చెల్లిస్తే నెలకు రూ.15,46,35,000 చెల్లించాలి ఇది ఏడాదికి రూ.185,56,20,000 అవుతుంది. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024 జూన్ నుంచి 2025 జూన్ వరకు రెండు నియోజకవర్గాల్లో అర్హులైన 2,07,119 మంది మహిళలకు ఏడాదికి రూ.372,81,42,000 ఆడబిడ్డ నిధి పథకంలో చెల్లించాలి. అయితే ఇప్పటి వరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదు. దీంతో మహిళల పాలిట సూపర్ సిక్స్ పథకాలు, సూపర్ మోసం పథకాలుగా మారిపోయాయి.

**నగరి, జీడీ నెల్లూరుల్లో మహిళల సంఖ్య**

| మండలం | మహిళలు | నెలకు రావలసినది | ఏడాదికి రావలసినది రూ.కోట్లలో |
|---|---|---|---|
| నగరి | 41860 | 6,27,90,000 | 75.35 |
| పుత్తూరు | 29105 | 4,36,57,500 | 52.39 |
| విజయపురం | 11082 | 1,66,23,000 | 19.95 |
| నిండ్ర | 12758 | 1,91,37,000 | 22.96 |
| వడమాలపేట | 9224 | 1,38,36,000 | 16.60 |
| జీడీ నెల్లూరు | 27,126 | 4,06,89,000 | 48.83 |
| కార్వేటినగరం | 17,654 | 2,64,81,000 | 31.78 |
| ఎస్ఆర్ పురం | 14,805 | 2,22,07,500 | 26.65 |
| పాలసముద్రం | 8,780 | 1,31,70,000 | 15.80 |
| పెనుమూరు | 16,555 | 2,48,32,500 | 29.80 |
| వెదురుకుప్పం | 18,170 | 2,72,55,000 | 32.71 |
| మొత్తం | 2,07,119 | 31,06,78,500 | 372.81 |

**ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో..**

పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీని తప్పక అమలు చేయాలి. పథకం అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఏడాది సమయం సరిపోతుంది. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నాం.
–ఎస్.కవిత, ముడిపల్లి, నగరి మండలం

**ఆశపెట్టి మోసం చేశారు**



18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.1500 వంతున ఇస్తానని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయినా ఒక్క నెల కూడా ఇవ్వలేదు. పైగా ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికీ ఇస్తామని నమ్మబలికారు. ఆశపెట్టి ఇవ్వకుండా చేయడం మోసం చేసినట్లే. ఇకనైనా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి. –కె.రేవతి, గాంధీ నగర్, పుత్తూరు

**ఓట్ల కోసమే సూపర్ సిక్స్**



ఎన్నికల సమయంలో ఆడబిడ్డలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఏడాదిగా ఎదురుచూస్తున్నాం. ఇంకా పైసా కూడా రాలేదు. ఓట్ల కోసమే సూపర్ సిక్స్ పథకాలు చెప్పినట్లు తెలుస్తోంది. వెంటనే ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. –లావణ్య, విజయపురం

**మోసపూరిత వాగ్దానాలు**



ఆడబిడ్డ నిధి పేరిట ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇస్తామని నమ్మించి.. ఇప్పుడు మోసం చేస్తున్నారు. వేలకోట్లు అప్పులు తెస్తున్నా మహిళలకు ఇచ్చిన హామీ మాత్రం నెరవేరడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ మోసపూరిత వాగ్దానాలుగా మారిపోయాయి.
–అములు, గోపిశెట్టిపల్లి, కార్వేటినగరం మండలం

### చోరీలకు పాల్పడే ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

**నగరి:** సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల మూసివున్న నివాసాల్లో డబ్బులు, వస్తువులు చోరీ జరగడం, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల చోరీలకు గురవడంపై ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించిన సీఐ విక్రమ్, పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదివారం డీఎస్పీ మహమ్మద్ అజీజ్ కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. చోరీలకు సంబంధించి పాత నేరస్తులతో పాటు, అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నగరి ఎస్‌ఐ విజయ నాయక్‌కు అందిన సమాచారం మేరకు, నగరి మున్సిపాలిటీ, ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ వద్ద ఇద్దరు వ్యక్తులను అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. వారు నగరి మున్సిపాలిటీ, పుదుపేటకు చెందిన లేట్ క్రిష్ణన్ కుమారుడు రాజేష్ (27), రాజా కుమారుడు జాన్సన్(24)గా గుర్తించామన్నారు. వీరిద్దరూ కలసి నగరి టౌన్ చిదంబరనగర్, పద్మావతినగర్‌లలో రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి వెండి సామాన్లు, డబ్బులు, ఇతర వస్తువులు దొంగిలించినట్లు నిర్ధారించామన్నారు. ఎస్ఆర్ పురం మండలం, కొత్తపల్లిమిట్ట వద్ద వ్యవసాయ బావులకు అమర్చిన బోరు మోటార్లను దొంగిలించినట్లు విచారణలో తేలిందన్నారు. వారి నుంచి 370 గ్రాముల వెండి వస్తువులు, ఒక గ్యాస్ సిలిండర్, ఒక ఫ్యాన్, మూడు వ్యవసాయ బోరు మోటార్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ ఒక లక్ష రూపాయలు ఉంటుందన్నారు. ముద్దాయిలను అరెస్ట్ చేసి, నగరి కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా, ఇద్దరికీ 14 రోజులు రిమాండ్ విధించడం జరిగిందన్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన సిబ్బంది పోలీసు కానిస్టేబుల్ గజేంద్ర, అశోక్, సురేష్, గోపి, రమేష్‌లను అభినందించారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**నింద్ర:** ఇరవయ్యేళ్ల క్రితం తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆదివారం నింద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుసుకున్నారు. ఆనందంగా గడిపారు. 2005–06 లో పదతరగతి చదువుకున్న విద్యార్థులు 20 సంవత్సరాలు తరువాత అదే పాఠశాలలో కలుసుకోవడంతో సందడి నెలకొంది.

## కక్ష సాధింపులే తప్ప.. పథకాలేవీ?



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

**పాలసముద్రం:** ముఖ్యమంత్రి చంద్రబాబుకు కక్ష సాధింపులపై ఉన్న మక్కువ.. పేద ప్రజల సంక్షేమంపై లేదని, కడప గడ్డపై మహానాడులో తండ్రీకొడుకులు నటన ప్రదర్శించారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆదివారం నరసింహాపురంలో వైఎస్ఆర్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు చేసి పంటలు పండించి, మళ్లీ రెండో పంట పెట్టే పరిస్థితి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో ఒకేసారి అన్ని భవనాలు నిర్మించి ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారి లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ఆ భారం ప్రజలపై మోపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసి యాదవ్, నరసింహరాజు, ఆనందన్, ప్రకాష్, తిరుమల, రవిరెడ్డి, చిన్నపయ్యన్, షణ్ముగరెడ్డి, సుందరాజు, కుమార్, కుట్టి, సర్పంచ్ అయ్యప్ప, అనురేఖ, లక్ష్మీపతి, పద్మనాభనాయుడు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

**నూతన దంపతులకు ఆశీర్వాదం**

మండలంలోని నరసింహపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు లక్ష్మీపతి కుమారుడు ప్రతాప్, తమిళనాడు రాష్ట్రం రామనాథపురానికి చెందిన లలితకు గత రెండు రోజుల క్రితం వివాహం అయినది. నూతన దంపతులను ఆదివారం తమ పార్టీ కార్యకర్తలతో కలిసి ఆశీర్వదించారు.

## రేషన్ పంపిణీ ప్రారంభం

**నగరి:** షాపుల వద్దే రేషన్ పంపిణీని ఆర్డీఓ భవానీ శంకరి ఆదివారం ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని కీళపట్టు రేషన్ దుకాణానికి తహశీల్దార్ రవికుమార్‌తోపాటు వెళ్లిన ఆమె షాపుల వద్దే రేషన్ వేసే విధానాన్ని ప్రారంభించారు. కార్డుదారులకు సమయపాలన పాటిస్తూ రేషన్ సరకులు సరైన తూకంతో సరఫరా చేయాలని డీలర్లకు సూచించారు. పంపిణీలో ఏవైనా పొరపాట్లు జరిగినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సౌకర్యాలు మెరుగు పరచండి

**పుత్తూరు:** పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రతిరోజూ పుత్తూరు స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు సుమారు 2 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. చెన్నై, తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్ నగరాలకు ప్రతిరోజూ ఇక్కడి నుంచి వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఇంత రద్దీ కలిగిన పుత్తూరు రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మాత్రం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించిన చిన్నపాటి వంతెనే నేటికీ ఒకటో ప్లాట్‌ఫామ్‌ను, రెండు, మూడు ప్లాట్‌ఫామ్స్‌ను కలుపుతోంది. దీనిపైకి ఎక్కి అటూ ఇటూ వెళ్లాలన్నా, రావాలన్నా ఎండకు ఎండుతూ, వానకు తడవాల్సిందే. ఈ బ్రిడ్జిపై పైకప్పు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఏళ్ల తరబడి అలానే ఉంది. అలాగే రైల్వేస్టేషన్ ప్రధాన ముఖద్వారం వద్ద పండుగల సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఆ సమయాల్లో స్టేషన్‌లోకి వెళ్లే పరిస్థితి లేక ప్రయాణికులు ట్రైన్ మిస్ అయిన సందర్భాలు అనేకం. దీనిని అధిగమించడానికి ఎంబీ రోడ్డు వద్ద గతంలో మాదిరి మరో దారిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పుత్తూరు శల్య వైద్యానికి ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి ప్రతిరోజూ వందలాది మంది రోగులు రైళ్ల ద్వారా ప్రయాణిస్తుంటారు. వీరికి సౌకర్యంగా వీల్ చైర్స్ అందుబాటులో లేకపోవడంతో రోగులే వీల్ చైర్స్ తీసుకురావల్సిన పరిస్థితి. నడవలేని ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే బ్రిడ్జికి లిఫ్టు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్టేషన్‌లో క్యాంటీన్, ఇతర కూల్‌డ్రింక్స్ షాపులతో పాటు మరుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనిస్తున్న రైల్వే అధికారులు సమస్యల పరిష్కారానికి మాత్రం చొరవ చూపడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం, ప్రయాణికులతో కలిసి రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

**వెదురుకుప్పం:** అబద్దపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది కావస్తున్నా ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నందుకు నిరసనగా 4న పెద్ద ఎత్తున నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నాగరాణి పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటు దినం ఆందోళనకు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఆసన్నమైనట్లు పేర్కొన్నారు. అధికారం, స్వప్రయోజనాల కోసం ప్రజలను వెన్నుపోటు పొడవడం సీఎం చంద్రబాబు నైజమన్నారు. గత ఐదేళ్ల వైఎస్ఆర్ సీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేసి చూపినట్లు గుర్తు చేశారు. అనంతరం వైఎస్ఆర్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి మాట్లాడుతూ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు పథకం, మహాలక్ష్మి, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, పేదలకు మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు తదితర సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ప్రజలను దగా చేసినట్లు చెప్పారు. కొత్తవి సరే ఉన్న వాటిని పీకేస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్లు చెప్పారు. పేదల పక్షాన నిలబడేందుకు వైఎస్ఆర్ సీపీ ఉందని అందరూ కలిసి వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేసి కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని కోరారు.



దుర్యోధన వధ ఘట్టం

## అలరించిన దుర్యోధన వధ

**శ్రీరంగరాజపురం:** ఎస్ఆర్ పురం మండలంలో వీపీపురం గ్రామ పంచాయతీ అంకనపల్లి గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీ దేవి ఆలయ ఆవరణలో దుర్యోధన వధ సందర్భంగా ప్రతిమను మట్టితో ఏర్పాటు చేసి, మడుగులో దాగిన దుర్యోధనుడిని భీముడు లాగి వధించిన ఘట్టం ఆదివారం వీక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, నిర్వాహకులు రామనాథరెడ్డి, దాము నాయుడు, జనార్ధన్, మణి, లోకనాథరెడ్డి, రఘునాథరెడ్డి, ప్రసాద్ రెడ్డి, నటరాజ్ ఆచారి, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రసాయనాలతో జీవనం



నివాసాల చుట్టూ హానికర రసాయన నీరు





పంప్ హౌస్ చుట్టూ నిండిన రసాయన నీరు

- నివాసాల చుట్టూ రసాయనాల నీరు
- ఎలా జీవించాలంటూ ప్రశ్నిస్తున్న ఏకాంబరకుప్పంవాసులు
- అధికారులకు మా గోడు వినిపించదా?
- ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు

డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే హానికర రసాయన నీరు స్థానిక ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. ఇప్పటి వరకు కాలువలు, చెరువులు, నదుల్లో ప్రవహిస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తూ, వ్యవసాయాన్ని సర్వనాశనం చేస్తూ వచ్చిన పాషాణజలం రెండడుగులు ముందుకు వేసి నివాసాల చుట్టూ కూడా పారుతోంది. రసాయన నీటిని అదుపు చేయాలని ప్రజాసంఘాలు, సంక్షేమ సంఘాలు చేపడుతున్న నిరసనలు రెట్టింపు వేగంతో వచ్చే పాషాణాన్ని అదుపుచేయలేక పోతున్నాయి. అధికారులు ఎవాపరేటర్లు ఉన్నవారికే అనుమతులు ఇచ్చామని, ఇకపై రసాయన నీరు బయటకు రాదని చెబుతున్నా అవి వాస్తవాలకు అందనంత దూరంలో ఉన్నాయి. ఇదివరకటి కంటే ఎక్కువగా రసాయన నీరు ప్రవహిస్తోంది. – నగరి

ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ సమీపం డబ్బా ఫ్యాక్టరీ వీధిలోని నివాసాలు చుట్టూ డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే రసాయన నీరు చేరడంతో స్థానికులు ఆగ్రహానికి లోనవుతున్నారు. చిన్న పిల్లలు ఎక్కువగా ఉన్నారని రాత్రిపూట వచ్చే దుర్వాసనతో ఎవ్వరికీ నిద్రపట్టడం లేదు. రసాయనాలు కలిసిన గాలిని చిన్నారులు పీలుస్తున్నారని, వారి ఆరోగ్యం ఏం కావాలంటూ ప్రశ్నిస్తున్నారు. నివాసాల చుట్టూ రసాయనాలే ఉండడంతో సెలవుల్లో ఆడుకోవడానికి కూడా బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. తమ స్థలాలపై ఇలా రసాయనీరు పారుతూ ఇంకుతుంటే తాము ఆ ప్రాంతాల్లో ఎలా ఇళ్లు నిర్మించుకోవాలని ఖాళీ స్థలాల యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తాగునీరు స్వచ్ఛంగా రావడం లేదని పరిస్థితి ఇలాగే కొనసాగితే మానవ మనుగడే కష్టతరమవుతుందన్నారు. ఈటీపీ ప్లాంటును నిర్వహణలోకి తెచ్చేవరకు డైయింగ్ యూనిట్లను మూసి ఉంచాలని, లేకుంటే ఇళ్లలోకే రసాయన నీరు వచ్చే ఆస్కారముందన్నారు.

**సీఈటీపీ ఆగిపోవడమే కారణం**

సీఈటీపీ నిర్వహణలో లేదు. ఇప్పటికే అది పూర్తిస్థాయిలో రసాయన నీటితో నిండుకుంది. మరమ్మతులకు సంబంధించిన పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. ఆ ప్లాంటుతో అనుసంధానమైన డైయింగ్ యూనిట్ల వారు అది పనిచేస్తే మాకేంటి.. పని చేయకుంటే మాకేంటి అంటూ యధాతథంగా రసాయన నీటిని వదిలేస్తున్నారు. మరోవైపు అనుమతివ్వని డైయింగ్ యూనిట్లు కూడా అధికారుల కన్నుగప్పి రాత్రిపూట తమపని కానిచ్చేస్తూ నీటిని వదిలేస్తున్నాయి. ఇలా వెల్లువలా వచ్చే రసాయన నీరు ఈటీపీకి పంపింగ్ చేసే పంప్ హౌస్ చుట్టూ చేరి గుంటలా మారిపోయింది. అక్కడి నుంచి పక్కనే ఉన్న ఖాళీ స్థలాలపై పారుతూ నివాసాల చుట్టూ చేరింది. దీంతో అక్కడ నివశించే వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నివాసాల చుట్టూ చేరిన రసాయనీటిని చూపుతున్న జనం

**ఇల్లు పడిపోతుందేమో..**



నేను, దివ్యాంగురాలైన నా కుమార్తె, వినికిడి లేని మాటలు రాని మనవడితో శిథిలావస్థకు లోనవుతూ రసాయన నీరు వస్తున్న ఇంటిలో కాపురం ఉన్నాం. ప్రస్తుతం ఇంటి చుట్టూ హానికర రసాయనాలు కలిసిన నీరు ప్రవహిస్తోంది. భూమిలో నీరు బాగా ఇంకి కుంగితే ఇళ్లుపడిపోయే ప్రమాదం ఉంది. అదీగాక ఇంటి పెరటికి వెళ్లాలన్నా భయపడేంత దుర్వాసన వస్తోంది. ఇక్కడ ఎలా జీవించాలి. మమ్మల్ని అధికారులే రక్షించాలి. – పద్మ, ఏకాంబరకుప్పం

### క్రీడా యూనిఫాం ఆవిష్కరణ



క్రీడా యూనిఫాం ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి

**కార్వేటినగరం:** యువకులను, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సాహించడానికి యువ ముస్లిం నాయకుడు తౌఫిర్‌ఖాన్ ముందుకు రావడం అభినందనీయమని వైఎస్ఆర్ సీపీ జీడీ నెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి అన్నారు. ఆదివారం కార్వేటినగరం మైనారిటీ నాయకులు విజయవాడలో ఇన్‌చార్జి కృపాలక్ష్మినికి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించి, సన్మానించారు. అనంతరం నియోజకవర్గం సమన్వయకర్త మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. అనంతరం క్రీడా యూనిఫాంను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ సీపీ మైనారిటీ నాయకులు ముస్తాక్, అమీనుల్లా, సమీర్, ఇర్షాద్‌ఖాన్, మణిరెడ్డి పాల్గొన్నారు.